క్లుప్తంగా

ప్రభుత్వానికి మంచిపేరు తేవాలి



ఎమ్మెల్యే కేపీకి బొకే అందిస్తున్న సెబ్ సీఐ శ్రీనివాసరావు

మార్కాపురం: సెబ్ అధికారులు ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. మార్కాపురం సెబ్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు.. ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందించి సన్మానించారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

మార్కాపురం: మూడు జిల్లాల్లో శాశ్వతంగా కరువును నివారించే వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసినందుకు, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ 3 వేల రూపాయల పింఛన్‌ను అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి వైఎస్సార్ సీపీ మైనార్టీ నేత సయ్యద్ గౌస్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో కరువును నివారించే వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. పలువురు పింఛనుదారులు పాల్గొని నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని,మరోసారిముఖ్యమంత్రికావాలని కోరారు.

గుంటి గంగలో అన్ని రకాల పూజలు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీగుంటిగంగా భవాని అమ్మవారి ఆలయంలో శుక్రవారం నుంచి ప్రతి రోజూ అర్చన, అష్టోత్రం సహస్రనామం పూజలు అందుబాటులో ఉంటాయని దేవస్థానం చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఈఓ కార్తీక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆలయంలో తాత్కాలిక పూజారులుగా పని చేస్తున్న విజయలక్ష్మి, బాలరాజు, వాహన పూజారి కామేశ్వరరావుతో పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో ఆలయ మాజీ చైర్మన్ సాని ఆంజనేయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

కొమరోలు: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టుల కోసం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ డి.నరసయ్య, సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణమూర్తి మండలంలోని అల్లినగరం, చింతలపల్లి, బ్రాహ్మణపల్లి, ఇడమకల్లు, కొమరోలు గ్రామ సచివాలయాల పరిధిలో ఖాళీ అయిన వలంటీర్ల పోస్టుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. అర్హులైన వారిని రెండు రోజుల్లో శిక్షణ ఇచ్చి విధుల్లోకి తీసుకుంటామని తెలిపారు.

దర్శిలో ఉప్పొంగిన అభిమానం



రాజంపల్లిలో పూజలు చేస్తున్న బూచేపల్లి కుటుంబం



ర్యాలీకి హాజరైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు



దర్శి గడియారం స్తంభం సెంటర్ వద్ద ర్యాలీకి హాజరైన జన సందోహంలోని ఓ భాగం

- వైఎస్సార్ సీపీ ర్యాలీకి జననీరాజనం
- బైక్‌లతో భారీ ర్యాలీ
- అడుగడుగునా హారతులిచ్చి స్వాగతం పలికిన ప్రజలు
- హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఆయన సతీమణి బూచేపల్లి నందినిలు హాజరయ్యారు. రాజంపల్లి శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో అష్టోత్తర శతనామావలి, ఆకుపూజ, వేదమంత్రాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాజంపల్లి, కొత్తరెడ్డిపాలెం, దర్శి గడియారం స్తంభం సెంటర్, వైఎస్సార్ సెంటర్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రాజంపల్లి నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సుమారు 3వేలకుపైగా బైక్‌లతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మోటారు సైకిళ్లకు వైఎస్సార్ సీపీ జెండాలు పెట్టుకుని బూచేపల్లి కుటుంబానికి ఘన స్వాగతం పలికారు. గుమ్మడి కాయలతో దిష్టి తీసి గజమాలలతో ఘనంగా సత్కరించారు. పట్టణంలోని దద్దాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గడియారం స్తంభం సెంటర్‌కు చేరుకునే సరికి దర్శి పట్టణం కిక్కిరిసిపోయింది. ఎటు చూసినా జన సందోహమే కనిపిస్తూ జై జగన్.., జై బూచేపల్లి అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలతో పట్టణం దద్దరిల్లింది. అడుగడుగునా హారతులిచ్చి పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. శివప్రసాద్‌రెడ్డి కుమారుడు విద్యాధర్‌రెడ్డిని బుల్లెట్ పై ఎక్కించుకుని ర్యాలీలో బైక్ నడిపి కార్యకర్తలను ఉత్సాహ పరిచారు. శివప్రసాద్‌రెడ్డి సతీమణి బూచేపల్లి నందినీ తన భర్త శివప్రసాద్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ అందరినీ ఆత్మీయంగా పలకరిస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. జై..జగన్, జై.. శివన్న అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. వైద్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎం బాషా, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి, మండల కన్వీనర్‌లు వెన్నపూస వెంకటరెడ్డి, తూము వెంకట సుబ్బారెడ్డి, సుబ్బయ్య, ఎంపీపీలు సుధాఅచ్చయ్య, బొరిగొర్ల ఉషామురళి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, యూత్ వింగ్ ప్రధాన కార్యదర్శి ఇరుగుల శ్రీనివాసరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు మేకల కృష్ణారెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి వెర్రి ఆంజనేయరెడ్డి, జెడ్పీటీసీలు నుసుం నాగిరెడ్డి, తాతపూడి రత్నరాజు, వైస్ ఎంపీపీలు సోము దుర్గారెడ్డి, కొరివి ముసలయ్య, యడమకంటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు కేసరి రాంభూపాల్ రెడ్డి, కౌనిలర్‌లు ఆవుల జ్యోతి శివారెడ్డి, మేడం మోహన్‌రెడ్డి, జగన్నాథం మోహన్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

ఆదరించండి..అండగా ఉంటాం!

- జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఇన్‌చార్జి డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి
- ఇంటింటి ప్రచారానికి పులిపాడులో అనూహ్య స్పందన



పులిపాడులో ప్రజలకు అభివాదం చేస్తున్న బూచేపల్లి కుటుంబ సభ్యులు



వికలాంగుడితో ఆప్యాయంగా మాట్లాడుతున్న డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి

ముండ్లమూరు: ప్రజలు ఆశీర్వదించి ఆదరిస్తే బూచేపల్లి కుటుంబం మీతో ఉంటూ అన్ని వేళలా అండగా ఉంటుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని పులిపాడులో గురువారం మన ఊరికి..మన శివన్న కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. దర్శి నుంచి భారీ బైక్ ర్యాలీతో గ్రామానికి చేరుకొని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలోని కొత్తూరు, పాతూరు రామాలయాలు, పీర్ల చావిడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ ప్రధాన వీధుల్లో కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులతో కలిసి నడిచి ఇంటింటి ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ వారి కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బూచేపల్లి కుటుంబానికి పులిపాడుతో విడదీయలేని సంబంధం ఉందన్నారు. తన తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి ఎన్నికల ప్రచారం పులిపాడు నుంచి ప్రారంభించి విజయం సాధించినట్లు శివప్రసాద్‌రెడ్డి గుర్తు చేశారు. గతంలో తననూ అదే తరహాలో గెలిపించారని చెప్పారు. గ్రామానికి చెందిన యాదాల కాశిరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఇరవై వేల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఎస్సీ కాలనీకి చెందిన అంగవైకల్యం గల బొందలపాటి లాజర్‌ను ఆప్యాయంగా పలకరించి అతడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తల్లి వెంకాయమ్మ, భార్య నందిని, కుమారుడు విధ్యాధర్‌రెడ్డిలతో కలిసి గడప గడపకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. మధ్యాహ్నం పులిపాడులో అన్నదానం చేశారు. జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, వైస్ ఎంపీపీ బంకా రమణమ్మ నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల పార్టీ మాజీ కన్వీనర్ సూదిదేవర అంజయ్య, సర్పంచ్‌ల సంఘ మండల మాజీ అధ్యక్షులు చింతా శ్రీనివాసరెడ్డి, పులిపాడు సర్పంచ్ ముక్కమళ్ల శ్రీనివాసరెడ్డి, నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, మేకల వెంకటేశ్వరెడ్డి, కానాల రవికుమార్‌రెడ్డి, ముక్కమళ్ల రమణారెడ్డి, ఏరేసి రమణారెడ్డి, కుంటా అచ్చారావు, సానికొమ్ము రాజశేఖరరెడ్డి, ఆవుల నాగేశ్వరరావు, ఏటి మల్లెపుకొండ, మేకల చెంచయ్య, భిక్షాలురెడ్డి, గొంది వెంకటప్పారెడ్డి, మేడగం వెంకటరమణారెడ్డి, కోదండరామయ్య, మండలపు అశోక్, చింతల కోటిరెడ్డి, జనమాల పిచ్చయ్య పాల్గొన్నారు.

రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: వచ్చే ఫిబ్రవరి 16వ తేదీన జరిగే రథసప్తమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో రథసప్తమి కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవదాయ, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో పాటు స్థానికంగా ఉండే వివిధ వర్తక, వ్యాపార వాణిజ్య సంఘాల ప్రతినిధులతో సమన్వయం చేసుకొని ఉత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్నీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో తిరుమల తరువాత మార్కాపురం పట్టణంలో శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి వారికి రథసప్తమి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారనే పేరును కొనసాగిస్తూ సప్తవాహనాలపై స్వామి ఊరేగే సమయంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆయా శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. దేవదాయశాఖ తరపున అన్నీ ఏర్పాట్లు చేస్తామని ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి, చైర్మన్ కేశవరావు తెలిపారు. మున్సిపల్ శాఖ తరపున సహాయ సహకారాలు అందిస్తానని చైర్మన్ బాలమురళీకృష్ణ తెలిపారు. ప్రధాన అర్చకులు అప్పనాచార్యులు, మాజీ చైర్మన్ యక్కలి కాశీ విశ్వనాథం, ఊటుకూరి రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం కృషి



సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ

త్రిపురాంతకం: ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి కృషి చేస్తోందని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దూపాడులో 20 లక్షల రూపాయలతో సీసీ రోడ్డుకు గురువారం ఆయన భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మైనార్టీ నాయకుడు రహమాన్, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో చర్చి దగ్ధం

కురిచేడు (దొనకొండ): అగ్ని ప్రమాదంలో చర్చి దగ్ధమైన సంఘటన మండలంలోని ఆవులమంద పంచాయతీ రామాంజనేయ కాలనీలో గురువారం మధ్యాహ్నం జరిగింది. పాస్టర్ సోమవరపు అర్జున్ తెలిపిన వివరాలు... బేతేలు ప్రార్థన మందిరంలో మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.30 వేల నష్టం జరిగినట్లు పాస్టర్ తెలిపారు.

ఓటు విలువ అమూల్యం



ర్యాలీకి హాజరైన సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

మార్కాపురం టౌన్: ప్రజాస్వామ్యంతలో ఓటు విలువ అమూల్యమని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సబ్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. గురువారం ఓటరు దినోత్సవం సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మంజునాథరెడ్డి, ఎలక్షన్ డీటీ భాగ్యలక్ష్మి, ఎంఈఓ రాందాస్ నాయక్, కమిషనర్ రవీంద్ర, ఎంపీడీఓ చందన, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసన్, ఆర్ఓ రంగారావు పాల్గొన్నారు. శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఓటరు దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజబాబు, డీన్ మస్తానయ్యలు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల కార్యదర్శి ఆదిమూలపు విశాల్, హెచ్ఓడీలు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల కార్యదర్శి అన్నా కృష్ణచైతన్య, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి మాట్లాడారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్లు ప్రారంభం



మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న సర్పంచ్ హారిక, నాయకులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను సర్పంచ్ చిత్తూరి హారిక ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ శ్రీశైలం పుణ్యక్షేత్రానికి తరలి వెళ్లే యాత్రికులకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి, మాజీ ఎంపీపీ జోగి వెంకటనారాయణ, నాయకులు యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, దర్గయ్య, ఉపాధ్యాయులు సన్నిధి కిరణ్‌కిశోర్ కుమార్, కరణాకర్, వర్ధన్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సత్తాచాటిన పూసలపాడు టీమ్



విన్నర్స్‌గా గెలుపొందిన క్రీడాకారులు

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడుకు చెందిన జట్టు నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో సత్తాచాటింది. ఉండేలా రజిత, కర్నాటి పుష్పాంజలిలు మహిళల బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో విన్నర్స్‌గా నిలిచారు. పంచాయతీ కార్యదర్శి జె.రంగస్వామి, పీఈటీ పెరుమారెడ్డి రమణారెడ్డి, సర్పంచ్ మొగుళ్లూరి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ పార్వతిలు గెలుపొందిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

నేడు తాళ్లూరులో 'మన ఊరికి మన శివన్న'

తాళ్లూరు (ముండ్లమూరు): దర్శి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మన ఊరికి..మన శివన్న, ఆదరించండి..ఆశీర్వదించండి కార్యక్రమం మండలంలోని రజానగరంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి నరేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు శ్రీగుంటిగంగా భవాని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారని చెప్పారు. అనంతరం రజానగరంలో మన ఊరికి.. మన శివన్న ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

మాజీ సర్పంచ్‌కు బూచేపల్లి పరామర్శ



పెద్దిరెడ్డిని పరామర్శిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: వైఎస్సార్ సీపీ బైక్ ర్యాలీలో మోటారు సైకిల్ అదుపుతప్పి కింద పడిపోయిన తాళ్లూరు మండలం మాధవరం మాజీ సర్పంచ్ కోట పెద్దిరెడ్డిని ఒంగోలు ఆస్పత్రికి తరలించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఒంగోలు వెళ్లి ఆస్పత్రిలో ఉన్న పెద్దిరెడ్డిని పరామర్శించారు. ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.

గణతంత్ర వేడుకలకు హాజరు కావాలి

బేస్తవారిపేట: స్థానిక మాజీ సైనికుల కార్యాలయంలో శుక్రవారం ఉదయం 8.30 గంటలకు 75వ గణతంత్ర దినోత్సం నిర్వహిస్తున్నట్లు మాజీ సైనికుల సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు బొల్లా బాలిరెడ్డి, జిల్లా నాయకుడు పి.వెంకటరాజులు తెలిపారు. మాజీ సైనికుల కార్యాలయంలో జెండా ఆవిష్కరణ, అనంతరం జంక్షన్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. మాజీ సైనికులు, సైనిక వితంతువులు, సైనికులు, సైనిక కుటుంబాల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

కొనకనమిట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉపయోగించుకొని లబ్ధి పొందాలని ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి అన్నారు. గురువారం మండలంలోని గొట్లగట్టు, పాతపాడు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి, దర్శి కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టు కె.వెంకటేశ్వరరెడ్డి, ప్రభుత్వ వైద్యాధికారి నరేంద్ర మాట్లాడుతూ వారు ప్రజలకు చేస్తున్న సేవలను వివరించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్‌లు పి.సుఖ్‌దేవ్, దొంతిరెడ్డి జయమ్మ చినరామిరెడి, ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, అంగన్‌వాడి సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రసాదు, మండల బీజేపీ కన్వీనర్ కిలారి శ్రీనివాసరావు, కార్యక్రమం కో ఆర్డినేటర్ పాపారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఫెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

పొదిలి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తమ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ధర్నా చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం తహసీల్దార్ అశోక్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. 11వ పీఆర్‌సీలో తగ్గించిన అడిషనల్ క్వాంటంను గతంలో మాదిరిగానే యథాతథంగా చెల్లించాలి, పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి, 11వ పీఆర్‌సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలి, హెల్త్ కార్డుల ద్వారా గుర్తింపు పొందిన అన్ని హాస్పటల్స్‌లో వైద్యం అందేలా చేయాలి, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ పరిధిని రెండు లక్షల నుంచి ఐదు లక్షలకు పెంచాలని కోరారు.

టమోటా లోడు లారీ బోల్తా

బేస్తవారిపేట: మండలంలోని సోమవారిపేట సమీపంలో చీతిరేల కతువ వద్ద అదుపుతప్పి టమోటా లోడు లారీ బోల్తా పడిన సంఘటన గురువారం జరిగింది. ఎనిమిది టన్నుల టమోటా కాయల బాక్స్‌లతో అనంతపూర్ నుంచి విజయవాడకు వెళ్తోంది. మార్గంమధ్యలో సోమవారిపేట సమీపంలో నిద్రమత్తులో కడప హైవేపై నుంచి కతువకు కుడి వైపున లోతైన గుంతలో పల్టీలు కొట్టుకుంటూ పడిపోయింది. అదృష్టవశాత్తు డ్రైవర్లు అమర్‌నాథ్‌రెడ్డి, సాంబశివారెడ్డిలకు ఎటువంటి ప్రమాదం జరుగలేదు. ఎడమవైపున పడి ఉంటే నిండా నీరున్న లోతైన కతువలో పడి భారీ నష్టం జరిగేది. లారీ ,టమోట బాక్స్‌లు నుజ్జునుజ్జయ్యాయి.